# ప్రేమ లేఖలు

" రా జా "

ప్పొంఆవిడ నాతో మాట్లాడటం మానేసింది.

నేనింట్లోలేనప్పుడు వచ్చిన అమ్మాయి 'మణి' మరెవరూకాదన్నీ కాలేజీలో చేరడంకోసం నారికమెండేషన్‌కోసం తిరుగుతూన్న అమ్మాయనీ ఎంతచెప్పినా, ఉహుఁ, మా ఆవిడ వింటేగా?

"ఇలా చూడు లలితా, కాస్త పెద్దపెద్ద హోదాలో ఉన్నవాళ్ళు వస్తూంటారు నాదగ్గిరకి నువ్వక్కడ యిలా మాట్లాడితే వాళ్ళకెంత యిదిగా వుంటుందో ఆలోచించావా? నువ్వే ఎవరన్నా నా స్నేహితుల యింటికి వెళ్ళావనుకో, ఆ యింటావిడ నిన్నుగురించి ."

లలిత ఏడ్పుతో ఒక్కసారి నాకు మెలకువ వచ్చింది.

"ఊఁ, కానీండి; అపేశారేం? ఆదారే పోయే పిల్లతోటి నన్నూ పోల్చండి, నామీద మీకున్న ప్రేమంతా చచ్చిపోయింది, యింకేం వుంటుంది? కొత్తవింతా, పాత రోతానూ."

నేను మెల్లిగా ఆమె భుజాలమీద చేతులేసి, "లలితా, యిలాచూడు, నీమీద ప్రేమ ఎలా పోతుందనుకున్నావు? నేనేమీ అనకముందే నువ్వే అన్నీ అనుకుని యింత రాద్ధాంతం చేస్తే ఎలాగ? మిగిలిన ఆడవాళ్ళంతాకూడా నీలాగే వుంటారని చెబితే నువ్వు యింత యిదిగా ఎందుకనుకోవాలి? నాగురించి నువ్వేమాత్రం అనుమాన పడక్కర్లేదు. నేను పూర్తిగా నీవాణ్ణే " అని బుజ్జగించాను.

నా అనునయాలతో ఆమె ఒక మోస్తరు సందేహం తీరినట్టు అవుపించి, విషయంమార్చి, అన్నగారి పెళ్ళి ప్రస్తావనలోపడింది.

"గోపాలంపెళ్లాం చాలా అదృష్టవంతురాలు, యిలా పెళ్ళి నిశ్చయంకావడంతోనే అలా వచ్చేసింది ఉద్యోగం." అంది.

గోపాలం డాక్టరేట్ డిగ్రీ సంపాయించాడు. యింకా అయిదురోజుల్లో ఈ ఊళ్ళోనే పెళ్ళి జరగబోతోంది, అతని మామగారుకూడా భాగా డబ్బున్నవారే. ఇంకా పదిహేను రోజుల్లో అతను ఉద్యోగంలో జాయిన్ కావాలన్న మాట!

"నిరుడు వేసంగిసెలవుల్లో నేనూ మా అన్నయ్యా కలిసి వెళ్ళి, పిల్లని చూశాం. నేను ఆ అమ్మాయిని సంగతులన్నీ కనుక్కున్నాను, యిష్టమేనని చెప్పింది కాని మావాడు మట్టుకు తన చదువు పూర్తికాందే చేసుకోనని గట్టిపట్టు పట్టాడు. అందుకే పెళ్లి ఆగిపోయింది, లేకపోతే అప్పుడే అయిపోను. అప్పుడు మీరు లేరు, పని మీద మెద్రాసుకో ఎక్కడికో వెళ్లారుగావును."

ఆ ప్రొద్దున్నేదిగాడు గోపాలం మాయింట్లో- వస్తూనే ఊరుతిరగడానికని వెళిపోయాడు.

"సరేగాని, గోపాలం వెడుతూ ఎప్పుడొచ్చేదీ చెప్పాడా?"

"ఉహుఁ, ఏమీ చెప్పలేదు, బహుశా సాయంత్రానికి వస్తాడేమో!"

నేను గడియారం చూశాను, అయిదుకి పది నిమిషాలు తక్కువ లలిత కాఫీ తేవడానికని లోపలికి వెళ్ళింది.

సరిగ్గా అయిదుకొడుతూంటే గోపాలం వచ్చాడు ఊరంతా పరిశోధించి

"చూశావూ? నే నొస్తూంటే తమాషాగా కలుసుకుని " "

ఇంతలో మా ఆవిడ వస్తూంటే సంభాషణ త్రెంచేశాడు గోపాలం,

"చెల్లీ, చూశావూ? మన చిట్టిగాడు ఈ ఊళ్ళోనే ఉన్నాడు." అన్నాడు,

"చిట్టిగాడా? ఎవరు చెప్మా!" ఆమె కనుబొమలు చిట్లించి, జ్ఞాపకంచేసుకుని, ఓహో,

వాడా. నాలుగైదేళ్ళయింది వాణ్ణిచూసి- అతను నీ కాబోయే మామగారికి వేలువిడిచిన మేనత్త మనమడు అవుతాడు కాదూ?"

"ఏమో మరి. నాకా సంగతి అంతా తెలియదు. మన యింటిదగ్గర్లో ఉండేవాడు ఇప్పుడు నా పెళ్ళిచూడ్డానికని ఈ ఊరొచ్చాడు రాత్రికి మన యింటికి వస్తాడు."

"గోపాలం, యిలారా నీ ఉద్యోగంగురించి మాట్లాడుకుందాం" అని వాణ్ణి నాగదికి తీసికెడుతూ, మా ఆవిడతో, "లలితా, ఈవాళరాత్రికి గోపాలం చిట్టిగాడితోకూడా యిక్కడే ఉంటాడు. రాత్రిదాకా బాతాకానీ కొట్టుకుంటూ కూర్చుంటాం. ఈవాళ మన వంటావిడకికూడా ఆట విడుపే, సినిమాకి పోతుంది వంటచేసేసి. మరి నీకేం తోచదుగాబట్టి నువ్వీవాళటికి సినిమాకివెళ్లు, శ్యామలా టాకీస్‌లో మంచి తెలుగు పిక్చర్ ఆడుతోంది. కావాలంటే తోడుగా పక్కింటి రవణమ్మగారినికూడా తీసికెళ్లు. యిప్పుడయిదున్నరయింది గదా, యింకోగంటకి సినిమా ప్రారంభమౌతుంది. నువ్వీలోపున టాయిలెట్ అయి, డ్రస్ అవు. మనకార్లో పోదువుగాని." అన్నా.

లలిత టాయిలెట్ అవడానికి వెళ్ళిపోయింది. ఆమె తిరిగి వచ్చేసరికి మా యిద్దరిమధ్యా సంభాషణ పూర్తి అయింది. మేమంతవరకూ చూస్తున్న ఉత్తరాలని గోపాలం చప్పున జేబులోకి తోసేసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

ఇంతలో తలుపు చప్పుడయింది. బహుశా ఆ అమ్మాయి వచ్చిందోయేమో! యింతకుముందు వచ్చినప్పుడు నేనింట్లోలేను. అంచేత మా ఆవిడ లేచేముందే నేను గబగబా తలుపుతీశాను, ఇంతా చేసి, పాలవాడే వచ్చాడు.

నేను బయటికి వెడుతూ, "లలితా, యిదుగో, పాలవాడొచ్చాడు. నేనిప్పుడే అయిదు నిమిషాల్లో వస్తాను. నువ్వీ లోపున సిద్ధంగా ఉండు." అని చెప్పి, నేను గబగబా బయలుదేరాను.

ఆరుంబావయింది- నేను ఎదురింటాయనతో కాస్త మాట్లాడి, యింటికివచ్చేసరికి మా ఆవిడ టాయిలెట్ పూర్తి చేసుకుని, రెడీగా ఉంది- ఆ దుస్తుల్లో ఆమె చాలా అందంగా కనిపించింది. నేను వెనకనించే వెళ్ళి ఆమె బుజాలమీద చెయ్యి వేశానోలేదో, ఆమె చురచురాచూచి, చెయ్యి విదిలించుకొని, గబగబా కారెక్కి సినిమాకి వెళిపోయింది. ఈ అకారణ క్రోధానికి కారణమేమిటా అని నే నాలోచించాను, ఆలోచించాను; ఎంతకీ నాకు అంతు తేలలేదు.

ఆమె వెళిపోయాక ఆ యింట్లో నేను తప్ప యింకెవరూలేరు. అదంతా నేను వేసుకున్న ప్లాను ప్రకారమే జరిగింది. అయినా మణిని రాత్రి ఎనిమిది గంటలకి రమ్మంటే ప్రొద్దున్నేవచ్చి మా ఆవిడకి యిన్ని అనుమానాలొచ్చేట్లా చెయ్యడం ఎందుకో? ఈ సంగతి లలితకి తెలిస్తే యింకేమన్నా ఉందా? పెద్ద తుపానురేగిపోదూ?

ఎనిమిదయింది. నేను ఒంటరిగా ఉన్నాననే దృఢమైన నమ్మకం కుదిరాక మణి ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా లోపలికొచ్చేందుకు గడియ తీసేఉంచి, తలుపు జారగిలావేశాను. ఆమె రాక ఎవరికీ తెలియకుండా ఉండేందుకు లోపల లైట్లన్నీ ఆర్పేసి, నా గదిలో కూర్చున్నాను. చీకట్లో నా రేడియం డయల్‌వాచీలో ఎనిమిదీ అయిదు నిమిషాలయింది.

యింతలో చిన్న అలికిడయింది "ఎలా అయితేనేం మణి వచ్చింది కావును!" అనుకుని గది తలుపుదగ్గిరకి వచ్చాను. ఎవరూ కనిపించలేదు తలుపు మామూలుగానే జారగిలాఉంది. "బహుశా వంటయింట్లో ఏదో అలికిడి ఎలకల వల్ల అయివుంటుంది" అనుకున్నాను.

ఎలాగయితేనేం, ఎనిమిదీ పదినిమిషాలకి టకటకా చప్పుడుచేసుకుంటూ మణి లోపలికి వచ్చింది. వస్తూనే తలుపు గడియవేసేసి, లైటు వేశాను

"ఏం పది నిమిషాలాలస్యం చేశావేం?"

ఆమె నవ్వుతూ వెనకనించి నా బుజంమీదుగా తన ఎడంచెయ్యిపెట్టి, వాచీ చూపిస్తూ, "సరిగ్గా ఎనిమిదయింది చూడండి." అంది.

"సరే, నువ్విక్కడ అట్టే సేపుండకూడదు త్వరగా వ్యవహారంతేల్చుకుందాం సరేగాని, నిన్న రాత్రి రమ్మంటే ప్రొద్దున్నే ఎందుకు వచ్చావు?"

"చాలా విషయాలు మాట్లాడవలసి ఉండి వచ్చాను, కాని మీరులేరు. సరే, డబ్బేదీ?"

"ముందర ఉత్తరా లేవీ?"

"ఇదుగో, ఆరున్నాయి అన్నిట్లోనూ ప్రేమ తొణికిసలాడుతోంది. ఇలాంటివి వొదిలిపెట్టడం నాకు చాలా బాధగా నేవుంది. కాని ఏం చెయ్యను? యిచ్చేదాకా గొంతుకమీద కూర్చొంటూంటే "

"ఒప్పుకున్నాను యిదుగో అయిదువందలూను ఆ ప్రేమ లేఖలిలా యియ్యి."

"మరో యేభై రూపాయలిస్తేనేగాని యిచ్చేది లేదు ఈ ఆరింటికీ ఆరువందలిస్తేనేగాని ఇచ్చేది లేదని ముందరే చెప్పలేదూ? అయినా, ఒక్కొక్క దానికీ వందేమిటి? అమూల్యాలు నిజంగా యిలాంటివి యింత తక్కువకే యిచ్చేశానంటే "

"సరే, కట్టిపెట్టు. ఇదుగో నీ అయిదువందల యేభై రూపాయలూను, యిలా యియ్యి ఉత్తరాలు."

అత్యవసరం, అతి ముఖ్యం కావడంచేత ఆ యేభై రూపాయలూకూడా యియ్యక తప్పింది కాదు.

ఆమె ప్రేమ లేఖల్ని యిచ్చేస్తూ, "యివిగో, యిహానేను వెళిపోవాలా? నే నక్కర్లేదా మీకు?" అంది.

"నోరుముయ్, ముందర అవతలికినడు"

ఆమె డబ్బు పర్సులో పెట్టుకుని, కృతజ్ఞతతో థాంక్స్ యివ్వబోయింది,

ఇంతలో రూక్షారుణ నేత్రాలతో కారకారలాడుతూ, మా ఆవిడ ఎదురుగా ప్రత్యక్షమైంది. ఏమిటిదీ? సినిమా పూర్తికావడానికి యింకా గంటపైమున్నా ఎలావచ్చిందీ? అందులోనూ తలుపు గడియవేసివుంటే ఎలావచ్చిందీ?—తల పీక్కున్నా బోధపడక దిగాలుపడి చూస్తున్నాను.

"ఈ శిష్యురాలు కాలేజీ సీట్ రికమెండేషన్ కోసం వచ్చింది కాదూ? మహా చక్కటి గురువు దొరికారు పాపం? మంచిపాఠం నేర్పుతున్నారు!" అంది మా ఆవిడ ఎత్తి పొడుస్తూ.

"నువ్వు సినిమాకి వెళ్లావనుకున్నాను." అన్నాను ఏమనడానికీ తోచక.

"అవును, మరి అలా అనుకోకపోతే ఈ ప్రేమలూ అవీ ఎలా జరుగుతాయి?"

"మీరు బహుశా ఈయన భార్య అనుకుంటాను. మా యిద్దరిమధ్యా యింతవరకూ ఏ ప్రేమ కలాపాలూ జరగలేదని హామీ యిస్తున్నాను." అందిమణి,

"సిగ్గులేక మాట్లాడ్డంకూడానూ, హామీ ఇస్తుందట హామీ! యిందాకా ఆయన్ని వెనకనించి నించి కౌగలించుకోవడం చూడలేదనుకున్నావా? యిప్పుడు చెయ్యీచెయ్యీ కలిపావూ? ఇంకాస్సేపటికి ఏం చేస్తావో! అబ్బ! ఈ ప్రపంచంలో నీతి అంటూ లేదా ఏమిటి?" అంటూ మా ఆవిడ గోలచేస్తోంది.

మణి వెంటనే అందుకుని, "నేనింతకుముందు మా యిద్దరిమధ్యా ఎటువంటి రొమాన్సూ జరగలేదని చెప్పాను. కాని మీరు నమ్మలేదు. అంచేత యిప్పుడు ప్రత్యక్షంగానే చూపిస్తాను." అంటూ క్షణంలో సగంలో నా మెడకి చేతులు పెనవేసి, ముద్దుపెట్టుకుని, "ఇక శలవు. అమ్మా, నమస్తే, యింకెప్పుడూ ఈ దారి నన్నారోను," అంటూ చకచకా బయటికి నడిచివెళ్ళిపోయింది.

ఈ విధంగా జరుగుతుందని అనుకోకపోవడం వల్ల నేనే తెల్లబోయాను. ఈ సంగతితో మా ఆవిడ నిశ్చేష్టురాలయిపోయిందంటే ఆశ్చర్యం లేదు. ఆమె మానసికంగా క్రుంగిపోతూ కుర్చీలో

కూలబడింది. నేను తలుపు గడియవేసి వస్తూ మా ఆవిడని అనునయించే విధానాల్ని ఆలోచించడం ఆరంభించాను.

ముందునుయ్యీ వెనక గొయ్యీ

మా ఆవిడ బల్లమీద చేతులానించి, చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది. నేను నెమ్మదిగా బుజంమీద చెయ్యివేశాను ఆమె విసురుగా విదిలించుకుంది. ఆమె కళ్లు ఆకలిగొన్న పులుల్లాగ భయంకరంగా ఉన్నాయి.

"ఇలా చూడు; ఇలాంటి స్థితిలో నువ్విలాగ ఏడవకూడదు. నాకోసం కాకపోయినా, మన కాబోయే పాపకోసమన్నా కాస్త సంతోషంగా ఉండు."

"సంతోషంట! మండినట్టేఉంది సంతోషం. నేను చచ్చిపోకూడదూ? ఊరికేనే అనలేదు మొగాళ్ళంతా పచ్చిమోసగాళ్ళని, మన పెళ్ళయి రెండేళ్ళయిందో లేదోగాని అప్పుడే మొదలెట్టింది బుద్ధి. అయిన ఎక్కడికి పోతుందీ, మంచిబుద్ధి పుట్టకతోటే ఉండాలిగానీ." అంటూ ఆమె తిరిగి ఏడవడం ఆరంభించింది.

" ఎందుకొచ్చింది లలితా, యిదంతాను? నేను నిర్దోషిని, ముమ్మాటికీ నిర్దోషిని, యివాళ జరిగినదంతా పొరపాటు. అంతకంటె మరేంలేదు" అన్నా.

"చాలించండి. మా అన్నయ్య గోపాలాన్ని చూడండి. యింతకాలంవరకూ మీలాగ నానా గడ్డీ కరవలేదు ఆఫీసరుట! ఆఫీసరు! ఎందుకొచ్చిన హోదాయిదీ? అడ్డమైనవానికి ప్రేమలేఖలు రాస్తూ, అడ్డమైనదాన్నీ కౌగలించుకుంటూ ఎందుకొచ్చినదీ బ్రతుకు? మా అన్నయ్యనిచూసి నేర్చుకోరాదూ? నిప్పే వాడు. పరాయి ఆడది చేతికితగిలితే ఆ భాగం కడిగేసుకుంటాడు. ఈ రెండు రోజులూ వాణ్ణి మీతో తిరగనిస్తే వాణ్ణికూడా చెడగొట్టేస్తారు మీరు, నాకి పాపేలేకపోతే ఈ పాటికి ఏ గోదావరిలోనో దూకేదాన్నే. ఏమయినా మీకోసరం నా ప్రేమమట్టుకు చావటంలేదు. మీరంటే ఏనాడో నామీద ప్రేమని ఒక్క క్షణంలో తెంపేసుకోగలిగారు యిహ మన మధ్య ఒక్కనాటికీ సుఖం వుండదు." అంటూ ఒక్కధాటీన లెక్చరిచ్చేసింది.

నే నింక ఆగలేకపోయాను, "ఇదిగో, నీకు సంగతంతా పూసగుచ్చినట్లు బట్టబయలుగా చెప్పేస్తాను, నిన్ను కష్టపెట్టకుండా గుట్టుగా చేద్దామనుకున్నానుగాని అది అసంభవమే అయింది. యింక ముందరచెప్పు, నువ్వింత పెందరాళే ఎలా వచ్చావు?"

"మీకంతగా కావలిస్తే చెబుతాను. మీరు పాలవాడొచ్చేసరికి గబగబా పరిగెత్తారు. యింతలో నాకా టేబిల్‌మీద ఒక చిన్న కాగితపు మడత కనిపించింది నేను వంటయింట్లోకి వెళ్ళి ఆ కాగితపు మడతనివిప్పి, చదివాను అందులో ఏముందో వేరే చెప్పటం ఎందుకూ? మీరే చదువుకోండి" అంటూ తన జాకెట్‌లోంచి ఆ కాగితపు ముక్క తీసి బల్లమీద పడేసింది. అది యిందకుముందు నేను చదివిన ఉత్తరాల్లో ఒకటి, అందులో యిలా ఉంది

ప్రియతమా,

[రేపు మన యిద్దరి సంబంధం తెగిపోయే వరకూ నిన్ని పేరుతోనే పిలుస్తాను.]

మనం విడిపోడంతప్పనిసరి, యికనీవద్దనించి ప్రేమంతా మూర్తీభవిస్తూ వచ్చిన ఆరు ఉత్తరాలనీ రేపు యిచ్చేస్తున్నాను. నిజంగా అవి అమూల్యాలు.

రేపు ఉత్తరాలని అందచెయ్యడంలో మన యిద్దరికీ ఉండే సంబంధం పూర్తిగా తెగిపోతుందంటే నాకు చాలా బాధగా ఉంది తలచుకోవడమే. అయినా అది తప్పేట్టు కనిపించడంలేదు.

నేను నిన్ను ప్రేమించాను. నువ్వూ అలాగే ప్రేమించావనుకున్నాను. కాని ఈ వుత్తరాల్ని అందజేయడంతో సమస్తమూ మర్చిపోవా

అన్నావు అది నాకు అసాధ్యమే, నీ కది సుసాధ్యం, మొగాడివి, ధనికుడైన మామగార్ని సంపాదిస్తున్నావ్. యింక నన్ను మరిచిపోటం ఎంతసేపు

ఈ వుత్తరాలకోసం నాకిచ్చేదబ్బు వుత్తరాల విలువక్రిందకాదు. నాకొకరకం భరణం అంతే.

ఈ విర్భాగ్యురాలికింతే రాసివుంది కావున

రేపు రాత్రి సరిగ్గా ఎనిమిదింటికి ఆ వుత్తరాల్ని యిచ్చేస్తున్నాను.

ఇట్లు
నీ మణి

"అవును లలితా, దాన్నింతకుముందే చూశాను. అయితే నువ్వు లోపలికెప్పుడొచ్చావు?"

"ఆ వుత్తరం చూస్తూనే నా తల తిరిగింది. దాన్నిబట్టి మీ నాటకం అంతా ఊహించాను. వుత్తరంమీద విన్నటి తారీఖువుంది గాబట్టి ఈ వాళ రాత్రి ఆ అమ్మాయి వస్తుందనీ, దానికోసమే వంటమనిషికి శలవిచ్చి, నన్ను సినిమాకి పంపేశీ, మీరు ఈ గ్రంథం జరిపేందుకు ప్లాను వేసుకున్నారనీ ఊహించాను-మీ ప్రేమకలాపాల్లో మమ్మల్ని హఠాత్తుగా పట్టెయ్యాలనుకున్నాను. అందుకని నేను సినిమాకి వెళ్లినట్లే వెళ్లి, అరగంటలోనే బస్సెక్కి, వెనక్కివచ్చేశాను. వీధి తలుపు జార్లగిలా వుండడంచేత మెల్లిగా చప్పుడు చెయ్యకుండా లోపలికి వచ్చేసి, తలుపులు మామూలుగా వేసేసి, వంటయింట్లో నక్కాను.

"అదా సంగతి! ఆ అలికిడి విని ఏ ఎలకలో అనుకున్నా."

"ఆ అమ్మాయివచ్చిన దగ్గిర్నించీ తలుపుకంతల్లోంచి అంతా గమనిస్తూనే వున్నాను.

"ఏముంది చూడ్డానికి, ఏమన్నా అవినీతి జరిగితేగదా!"

"ఈవాళటికి ఏమీ జరిగిఉండకపోవచ్చు, నాకు తెలియకుండా యింతకుముం దెన్నిసార్లు జరిగిందో ఏమో! అయినా వస్తూనే ఆ అమ్మాయి మిమ్మల్ని వెనకనించి కౌగలించుకోలేదూ?"

"ఛ ఛ, వాచీలో ప్రైము చూపించింది."

"మరి ఆఖరిన వెళిపోయేప్పటి సంగతో?"

"అది నాకే ఆశ్చర్యంగావుంది. నువ్వనవసరంగా ఆ అమ్మాయిని తిట్టడంచేత అభిమానం దెబ్బతిని అలాచేసింది అంతకంటె మరేమీ లేదు."

"పాపం, ఆ బోగంపిల్ల అభిమానం దెబ్బతింది కావును. నాకేమీ సిగ్గులేదన్నమాట!"

"నీకెలాంటి అపకారమూ తలపెట్టలేదు నేను."

"అయితే యిదంతా నా పిచ్చేనా?"

"కాదు, భ్రమ."

"ఇంతేనన్నమాట మీ జవాబు మీ పనికి మీరేమన్నా సంజాయిషీ చెప్పకుంటారనుకున్నాను. ఇంతకుముందు నన్ను ప్రేమించిన మనుష్యులుకారు మీరిప్పుడు. ఆ ప్రేమ ఆ నాడే చచ్చివుంటుంది. ఇప్పుడు చూపించేదంతా నటన! మొగాళ్లు ఎంతచక్కగానన్నా నటిస్తారు. అమాయికపుస్త్రీలు వాళ్లనటనలోయిట్టేమభ్యపడిపోతారు భగవంతుడు ఈ ముళ్లమీదే బ్రతకమంటాడు. తీసుకుపోకూడదా!" అంటూ ఆమె వెక్కివెక్కి ఏడ్వడం మొదలెట్టింది

దిక్కుమాలిన వాగ్దానంసంగతి అటుంచి. నా ప్రాణానికి ప్రాణం అయిన నా భార్య యిలా కుమిలిపోతూంటే అసలు సంగతి చెప్పడం నా విధి గాదా? భార్య ప్రేమరాశి—ప్రేమని అపార్థం చేసుకుందంటే, ఆమెని అనునయించడం ఎటువంటి వాగ్దానాన్నయినా చెరుపుకోని వాడెవ్వడన్నా ఉంటాడా?

"లలితా, ఇదుగో నీకు గొప్పదెబ్బ! ఈ ప్రేమలేఖల విషయంలో నాయకుడు ఎదురుగా నిలుచున్న నిర్భాగ్యుడు కాదు. చిన్నప్పటించీ

అతి జాగ్రత్తగా పెరిగిన మీ అన్నగారు గోపాలం!"

ఆమె నిశ్చేష్టురాలయిపోయి ఒక్కక్షణం చూసి, నన్ను తనచేతుల్లో నలిపేస్తూ, నా గుండెల్లో తలదాచుకుని ఏడ్చిఏడ్చి, క్షమార్పణ అడిగింది

ఇంతలో ఏదో జ్ఞాపకంవచ్చి, "మీరు చెప్పేది నిజం అని ఎలా అనుకోడం?" అని అడిగింది

"నన్నింకా నమ్మవన్నమాట! నమ్మకం లేకపోతే యిదుగో చూడు ఈ ప్రేమలేఖలు. మీ వాడి దస్తూరీ, మీ వాడి సంతకం వీటికే వదిలింది అయిదువందలయేభై రూపాయలు" అంటూ కోటు జేబులోంచి ఆ ప్రేమలేఖలు తీసి చూపించాను.

ఆమె ఉత్తరాలని తీసి, నిప్పంటిస్తూ, "నిష్కారణంగా అనుమానపడ్డాను మీమీద" అంది.

"మరేం లేదు లలితా మీ అన్నయ్య ఈ సంగతి యావత్తూ నాకు చెప్పి, నీకు చెప్పవద్దని నా దగ్గర్నించి వాగ్దానం తీసుకున్నాడు అందేత నీకు చాలా సేపటివరకూ చెప్పలేకపోయాను. కాని చివరికి అది నా మీదే ఎదురుతిరిగి, మన సౌఖ్యానికే అంతరాయం కలిగితే ఏం చేసేది? చెప్పక తప్పిందిగాదు" అన్నాను

"మరి ఆ టేబిల్ మీద ఉత్తరం సంగతేమిటి" అని అడిగింది లలిత.

"అదా అది గోపాలానికి నిన్ననే వచ్చింది. ఈవాళ దాన్ని మేం పరీక్షించేప్పుడు వాడు అజాగ్రత్తగా అక్కడ జారవిడిచినట్టున్నాడు ఇంక చిట్టిగాడి సంగతంటావా, వాడే అసలు గోపాలానికీ- మణికీ మధ్య రాయబారాలు నడిపినవాడు."

ఇంతలో ఎవరో తలుపుకొట్టడంతో నేను గబగబా తలుపుతీశాను. గోపాలం లోపలికి నడిచివచ్చాడు.

"ఏం అన్నయ్యా, నువ్వీవాళరాత్రికి చిట్టిగాడితో ఇంట్లో ఉంటానని చెప్పావే!"

"అహా, మళ్లా అ చిట్టిగాడు అలా ఊళ్లో తిరిగివద్దామని చెబితే ఆలా వెళ్ళాం ఊళ్లోకి— బావా, యిలా వస్తావా? సంగతులు మాట్లాడుకుందాం"

"అవేవో నాక్కూడా తెలుసులే అన్నయ్యా! నీ సంగతి తెలిసి నిజంగా తెల్లబోయాను, నువ్వా యింతవాడివని నే ననుకోలేదు ఎప్పుడూ."

ఆశ్చర్యంగా, సందేహంగా, కోపంగా నా వేపుచూశాడు గోపాలం,

లలిత అందుకుని "మరేం ఫర్వాలేదు ఆయన తప్పేమీలేదు. నేను నీకు నీతులు గరవనక్కర్లేదు. ఇలాంటివేమన్నా ముందు జరగబోయేట్టయితే నీ పెళ్ళానికే చెప్పుకోవాలి సంజాయిషీ" అంది

లలిత వంటయింట్లోకి పోయింది, నేను సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పి, "మాట నిలబెట్టుకోలేకపోయాను ఏం చెయ్యను చెప్పు, మీ చెల్లి అంతరాద్ధాంతం చేస్తూంటే? అయినా మీ చెల్లి ఏమీ అనుకోదులే" అన్నాను.

గోపాలం నా రెండుచేతులూ పట్టుకుని, "బావా, చాలా కృతజ్ఞుణ్ణి. ఆ ఉత్తరాలే సంపాదించకపోతే ఆజన్మాంతం నల్లమబ్బే నా జీవితంలో" అన్నాడు.

"మొగాడివి, ఉత్తరాలు కాల్చేసి ప్రతిష్ఠ నిలబెట్టుకున్నావు. పాపం, మరి మణి సంగతేమిటంటావ్?" అన్నాను.

వాడు జవాబు చెప్పలేదు.

అయినా ఎందుకా గొడవ? లోకానికి మణి సంగతే అక్కర్లేదు. ఇంక మనకి మట్టుకి ఎందుకా చర్చ?